సాక్షి అనంతపురం

గురువారం । 17 । జూలై । 2025



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, కణేకల్లులోని ఎరువుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. 8లో



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ''పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. పక్షం రోజులకు ఒకసారి పరిశ్రమలను కచ్చితంగా తనిఖీ చేయాలి'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత చాలా ముఖ్యమన్నారు. జిల్లాలో నాలుగు అత్యంత ప్రమాదకర రసాయన పరిశ్రమలు, ఏడు సాధారణ ప్రమాదకర రసాయనాలు కలిగిన పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమలను ఫ్యాక్టరీస్, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖల అధికారులు తనిఖీ చేసి 15 రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించాలని, ఇదే క్రమంలో సంబంధిత శాఖలకు సమాచారం అందేలా అనుసంధాన వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఐపీఆర్ఓ బాలకొండయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ మునిప్రసాద్, ప్రజారోగ్య శాఖ ఈఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: తిరుమల వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు (07009, 07010) నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి గురువారం (5 సర్వీసులు మాత్రమే) రైళ్లు రాకపోకలు సాగిస్తాయన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు.

నాంథేడ్-ధర్మవరం మధ్య..

నాంథేడ్-ధర్మవరం మధ్య ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, ఆదివారం రైళ్లు నడుపుతున్నట్లు శ్రీధర్ తెలిపారు. నాంథేడ్ జంక్షన్ (07189)లో ఆగస్టు 1 (శుక్రవారం) రైలు బయలుదేరుతుందన్నారు. అలాగే, ఆగస్టు 3 (శనివారం) తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. ముద్ఖడ్, ధర్మాబాద్, బాసర, నిజామబాద్, కామారెడ్డి, మేడ్చల్, చర్లోపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పగడిరాళ్ల, నీమ్మలిపూరి, రంపిచర్ల, వినుకొండ, మార్కపూర్, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల, జమ్మలమడుగు, యర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు,కదిరి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

ఇటువైపు వచ్చారో!



ఎక్సైజ్ అధికారులు గిలగిల

- మద్యం షాపుల్లో ఎమ్మార్పీకి మించి వసూళ్లు
- అయినా కేసులు కట్టొద్దంటూ ఎమ్మెల్యేల హుకుం
- ఇటీవల 'పురం'లో దాడులు చేశారని ఏసీ బదిలీ
- అక్రమాలపై కేసులు రాయాలంటూ మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాలు
- ఒత్తిళ్ల నడుమ నలిగిపోతున్న ఎక్సైజ్ అధికారులు
- తట్టుకోలేక సెలవులకు దరఖాస్తు చేసుకుంటున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందాన మారింది ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్సైజ్ అధికారుల పరిస్థితి. మద్యం అక్రమాలకు అడ్డు తగిలితే 'మీకు శంకరగిరి మాన్యాలు చూపిస్తాం' అని ఎమ్మెల్యేల బెదిరింపులు... కేసులు రాయకుండా ఏం చేస్తున్నారంటూ విజయవాడ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలు వెరసి వారి విధులు దినదిన గండంలా తయారయ్యాయి. కేసులు రాయలేక, ఎమ్మెల్యేల ఒత్తిళ్లు తట్టుకోలేక పలువురు అధికారులు సెలవులో వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఇప్పటికే కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు.

గతంలో ప్రశాంతంగా..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే ఎక్కువ అమ్ముతున్నారు.ఇలా ఇష్టారాజ్యంగా వసూళ్లు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఎక్సైజ్ చట్టం ప్రకారం రూ.5 లక్షలు జరిమానా రాయాలి. కానీ రైడింగ్ చేసి కేసులు రాద్దామంటే వెంటనే ఎమ్మెల్యేలు ఫోన్ చేసి కేసులు నమోదు చేయొద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇటీవల పామిడిలో ఓ ప్రజాప్రతినిధి షాపుపై కేసు రాసినందుకు ఎక్సైజ్ అధికారులపై మండిపడినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యేల ఒత్తిడితో ఎక్కడా కేసులు నమోదు చేసే పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో ప్రశాంతంగా విధులు నిర్వహించామని.. ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాడులు చేసినందుకు ఏసీ బదిలీ

హిందూపురంలో రెండు మాసాల క్రితం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి కల్తీ కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు.ఈ క్రమంలో కేసు నమోదు చేశారు. దీంతో ఆయన్ను ఏకంగా బదిలీ చేశారు. కేసు రాసిన వారంలోనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు బదిలీ చేయించడంతో మిగిలిన అధికారులు భయపడుతున్నారు. బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాగైతే ఎంతకాలం ఉద్యోగం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఎక్సైజ్ సీఐ ఒకరు వాపోయారు. ఇప్పటికే బెల్టుషాపులు, పర్మిట్ రూములు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా ఏమీ అనలేని స్థితిలో ఉన్నామని చెబుతున్నారు.

రూ.1,400 కోట్లు మార్కు దాటేసింది..

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. బెల్టుషాపులు, పర్మిట్ రూములు అందుబాటులోకి రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గడిచిన 10 నెలల్లో కూటమి సర్కారు తెచ్చిన కొత్త మద్యం పాలసీతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.1,400 కోట్లకు పైగా విలువైన మద్యం వినియోగమైంది. రోజూ సగటున రూ.4.69 కోట్ల విలువైన మద్యం వినియోగమవుతుండగా.. ఇటీవల వారం రోజుల పాటు జరిగిన పీర్ల పండగ సందర్భంగా రోజుకు రూ.7 కోట్ల మద్యం తాగినట్లు వెల్లడైంది.

ఉమ్మడి జిల్లాలో గడిచిన 10 నెలల్లో మద్యం అమ్మకాలు ఇలా

అనంతపురం జిల్లాలో వినియోగమైన మద్యం విలువ
రూ.876,21,66,706

శ్రీ సత్యసాయి జిల్లాలో వినియోగమైన మద్యం విలువ
రూ.530,99,87,966

ఎస్పీ పల్లెనిద్ర



పల్లెనిద్రలో భాగంగా మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

శెట్టూరు/అనంతపురం: శెట్టూరు మండలంలోని అనుంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఎస్పీ జగదీష్ 'పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలన్నారు. నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండడంతో యువత చెడిపోతున్నారని, రోడ్లు లేవని, పొలాలకు వెళ్తున్న రైతులపై ఎలుగుబంట్లు, ఇతర అడవి జంతువులు దాడి చేస్తున్నాయని, పొలాల్లో స్టార్టర్ పెట్టెలు, వైర్లు అధికంగా చోరీకి గురతున్నాయని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, సీఐ వంశీకృష్ణ, ఎస్ఐ రాంభూపాల్, గ్రామ సర్పంచ్ పాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

- బుధవారం ఉదయం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కేసుల ఛేదనపై పలు సూచనలు చేశారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. కీలక కేసుల ఛేదన, నిందితుల అరెస్ట్ తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర మట్టిని మింగేస్తున్నారు

- ఎస్ఆర్‌సీ సంస్థ అడ్డగోలు తవ్వకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



మట్టి తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడిన దృశ్యం



జేసీబీతో మట్టిని తవ్వుతూ..

సాక్షి టాస్క్‌ఫోర్స్: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎర్రమట్టిని అధికార పార్టీ నేతలు తోడేళ్లుగా మారి మింగేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని కంబదూరు మండలంలో మట్టి అక్రమ తవ్వకాలకు తెరలేపారు. ప్రభుత్వానికి రుసుము చెల్లించకుండానే రోజుకు రూ. లక్షలు మట్టిని కొల్లగొడుతున్నారు. రెవెన్యూ, పోలీసు, భూగర్భ గనుల శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఎస్ఆర్‌సీ ఇష్టారాజ్యం..

కంబదూరు మండల పరిధిలోని చెన్నంపల్లి సర్వే నంబర్ 9లో ప్రభుత్వ భూమి సుమారు 96 ఎకరాలకు పైగా ఉంది. దశాబ్దాల నుంచి పశువుల మేతకు అవసరమైన పచ్చిక బయలుగా ఉపయోగపడుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఆ మేరకే ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ భూమిలో అధికార పార్టీ నేతలు ఎర్రమట్టి తవ్వకాలకు తెర లేపారు. ప్రస్తుతం మండల కేంద్రం కంబదూరు నుంచి రామగిరి మండలం పేరూరు వరకు డబుల్ లేన్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులను ఎస్ఆర్‌సీ సంస్థ చేపడుతోంది. ఈ క్రమంలోనే దాదాపు 7 కిలోమీటర్ల మేర ఎర్రమట్టిని ఇప్పటికే రోడ్డుకిరువైపులా వేసేశారు. అయితే పొలాల నుంచి ఎర్రమట్టిని తరలించాలంటే సదరు రైతుల అనుమతితో పాటు ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నాం.. మనల్ని అడిగేదెవరని అనుకున్నారో ఏమో అలాంటివేమీ లేకుండా పచ్చిక బయలులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

పట్టని అధికారులు..

కంబదూరు నుంచి పేరూరు వరకు డబుల్ లేన్ రోడ్డు పనులు 14 కిలోమీటర్ల మేర రూ.32 కోట్లతో జరుగుతున్నాయి. ఆ రోడ్డుకిరువైపులా మట్టి వేసేందుకు ఎస్ఆర్‌సీ వారు రోజూ 10 నుంచి 20 టిప్పర్ల మట్టిని తరలించినట్లు సమాచారం. ఇలా రోజుకు మట్టి తవ్వకాలతో లక్షలాది రూపాయలు కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, పోలీసు, భూగర్భ గనుల శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై కంబదూరు తహసీల్దార్ బాలకిషన్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో 'సాక్షి' పలుమార్లు ప్రయత్నించినా స్పందించలేదు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



చెన్నంపల్లిలో ఎస్ఆర్‌సీ సంస్థ వారు ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. సర్వే నంబర్ 9లో ఎక్కడ పడితే అక్కడ భూమిని గుల్ల చేసి గుంతలుగా మార్చి వేశారు. చుట్టు పక్కల గ్రామాల్లోని పశువుల మేత కోసం వదిలిన భూమిలో పెద్దపెద్ద గుంతలు తవ్వారు. దీనిపై రెవెన్యూ, పోలీసు, భూగర్భ గనుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.హనుమంతరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కంబదూరు

పడిపోయిన సాగు విస్తీర్ణం

పడకేసిన 'ఖరీఫ్' ఏరువాక

- 50 వేల హెక్టార్ల వద్ద ఆగిపోయిన పంటల సాగు
- నెలాఖరు వరకు సమయం... అయినా, అంచనా చేరడం కష్టమే



అనంతపురం అగ్రికల్చర్: వానల్లేక ఖరీఫ్ ఏరువాక ముందుకు కదలని దుస్థితి నెలకొంది. విత్తు సమయం దగ్గర పడుతున్నా సాగు విస్తీర్ణం పెరగడం లేదు. 50 వేల హెక్టార్ల వద్ద ఆగిపోయింది. వర్షాధారంగా ఖరీఫ్‌లో 3,39,716 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. కానీ... నైరుతి రుతుపవనాలు ఏ మాత్రం ప్రభావం చూపకపోవడంతో వర్షాలు లేక సాగు చతికిలపడింది. ఇప్పటి వరకు కేవలం 15 శాతం విస్తీర్ణంలో పంటలు వేశారు. అరకొర తేమ నడుమ అక్కడక్కడా విత్తనాలు విత్తుతున్నా... సాధారణ విస్తీర్ణం చేరుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. పంటల సాగుకు ఈనెల 15 వరకూ సమయమున్నా.. వాతావరణ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుంటే నెలాఖరు లోపు 50 శాతం చేరుకోవడం గగనంగానే ఉంది. ఆగస్టు వస్తే వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధాన పంటలు కాకుండా జొన్న, సజ్జ, కొర్ర, ఉలవ, పెసర, అలసంద లాంటి ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమని చెబుతున్నారు.

గుంతకల్లులో 40 శాతం...

ఖరీఫ్‌లో సాధారణం కన్నా 30 శాతం తక్కువగా వర్షపాతం నమోదు కావడంతో పంటల సాగుకు ఇబ్బందిగా మారింది. శెట్టూరు మినహా మిగతా 30 మండలాల్లోనూ లోటు వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో గుంతకల్లు మండలంలో అత్యధికంగా 40 శాతం విస్తీర్ణంలో పంటలు వేశారు. 18 వేల హెక్టార్లకు గానూ 7 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. ఇక పుట్లూరు మండలంలో కేవలం ఒక శాతం విస్తీర్ణంలో పంటలు వేశారు. 4,199 హెక్టార్లకు గానూ 56 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేసినట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక వెల్లడిస్తోంది. గుమ్మఘట్టలో రెండు శాతం, తాడిపత్రి, పుట్లూరు మండలాల్లో కేవలం 4 శాతం, విడపనకల్లులో 6, ఉరవకొండ, శింగనమల 8 శాతం, పామిడి, గుత్తి 9 శాతం... ఇలా 25 మండలాల్లో 5 నుంచి 20 శాతం లోపు విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. గుంతకల్లుతో పాటు బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కంబదూరు, పెద్ద వడుగూరు మండలాల్లో మాత్రమే 20 శాతం పైబడి విస్తీర్ణంలో పంటలు వేయడం విశేషం. ఇప్పటి వరకు 17 వేల హెక్టార్లలో వేరుశనగ, 14 వేల హెక్టార్లలో కంది, 7,300 హెక్టార్లలో పత్తి, 6 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 2,500 హెక్టార్లలో ఆముదం, 1,000 హెక్టార్లలో సజ్జ పంటలు సాగులోకి వచ్చాయి.

పరిటాలలకు పరాభవం

- రామగిరి ఎంపీపీ ఎన్నికలో పారని పాచిక
- ఎన్ని కుతంత్రాలు చేసినా దక్కని పీఠం
- కేవలం ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరు
- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల గైర్హాజరు
- ఎంపీపీ ఎన్నిక నిరవధిక వాయిదా వేస్తున్నట్లు అధికారుల ప్రకటన

సొంత మండలం రామగిరిపై పట్టు నిలుపుకోవాలని భావించిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు పరాభవం ఎదురైంది. మెజార్టీ లేకపోయినా అప్రజాస్వామిక పద్ధతుల్లో ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని ఆమె వేసిన పాచిక పారలేదు. అధికారంలో ఉన్నా...అన్ని వ్యవస్థలనూ వాడుకున్నా రామగిరి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకోలేక భంగపడ్డారు.



ఎంపీపీ ఎన్నిక సందర్భంగా రామగిరిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీ కిడ్నాప్‌లు... దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రామగిరి ఎంపీపీ ఎన్నిక బుధవారం మరోసారి నిరవధికంగా వాయిదా పడింది. అధికారం చేతుల్లో ఉంది... ఏమైనా చేయవచ్చుననుకున్న 'పరిటాల' కుటుంబానికి సొంత మండలంపైనే పట్టుచిక్కక తీవ్ర పరాభవం ఎదురైంది.

ఇద్దరు మాత్రమే హాజరు

రామగిరి ఎంపీపీ ఎన్నిక కోసం అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అయితే 10 మంది ఎంపీటీసీలకు గాను నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు, పేరూరు-1 ఎంపీటీసీ కర్రెన్న మాత్రమే ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. వారిద్దరూ పురుషులు కావడం...ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు అయిన నేపథ్యంలో ఎన్నికల అధికారి సంజీవయ్య రామగిరి ఎంపీపీ ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీని ప్రకటిస్తే మళ్లీ అప్పుడు రామగిరి ఎంపీపీ ఎన్నికను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

తొమ్మిదిమంది వైఎస్సార్ సీపీ వారే...

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిటాల సొంత మండలం రామగిరిలో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించింది. మండలంలో తొమ్మిది పంచాయతీలుండగా ఏడు పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే ఘన విజయం సాధించారు. ఇక మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... 9 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజేతలుగా నిలిచి తొలిసారి రామగిరిలో ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మీనుగ నాగమ్మను పీఠంపై కూర్చోబెట్టారు.

మూడోసారి విఫలం

2024 డిసెంబర్ 30వ తేదీన రామగిరి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఎలాగైనా సొంతమండలం రామగిరిలో పట్టునిలుపుకోవాలని పరిటాల కుటుంబం భావించింది. కేవలం ఒకే ఒక్క పురుష ఎంపీటీసీతో అప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపీపీ స్థానం కైవసం చేసుకోవాలని ప్లాన్ వేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మార్చి 27న రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. టీడీపీ తరఫున నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు మాత్రమే ఉండగా... పేరూరు-1 ఎంపీటీసీ కర్రెన్నతో పాటు మాధాపురం ఎంపీటీసీ సంపత్‌కుమార్‌ను బలవంతంగా పార్టీలో చేర్చుకున్నారు. అయినా అప్పుడు ఎన్నిక వాయిదా పడగా, మే 19న మరోమారు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో రెండోసారి ఏకంగా పేరూరు-2 ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. దీంతో రెండుసార్లు ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని దెబ్బతిన్న పరిటాల కుటుంబం తాజాగా బుధవారం జరిగిన ఎన్నికలోనైనా పీఠం దక్కించుకోవాలని భావించింది. అయితే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలెవరూ సమావేశానికి హాజరు కాకపోవడంతో వారి పథకం పారలేదు.

ప్రజాతీర్పును గౌరవించి..

వైఎస్సార్ సీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు ప్రజాతీర్పును గౌరవించారు. వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన వారంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడ్డారు. ప్రలోభపెట్టినా.. భయపెట్టినా వెనక్కు తగ్గలేదు. అధికారం అండతో అప్రజాస్వామికంగా ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగం అనుసరిస్తున్న అధికార పార్టీ చర్యలను నిరసిస్తూ ఎంపీపీ ఎన్నికను బహిష్కరించినట్లు ప్రకటించారు.

జనావాసాల నడుమ డంపింగ్ యార్డా?



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు, రైతులు, నాయకులు



కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళనకారులు

అనంతపురం అర్బన్: ''నగరంలోని చెత్తను తీసుకొచ్చి మా గ్రామాల వద్ద వేసి చెత్త దిబ్బలుగా మార్చాలని చూస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదు. తమ భవిష్యత్తుతో చెలగాటం వద్దు. కాదూ కూడదని ముందుకువెళితే అడ్డుకుని తీరుతాం'' అంటూ నరసనాయనికుంట, నాగిరెడ్డిపల్లి, నారాయణపురం ప్రజలు, రైతులు పార్టీలకు అతీతంగా బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఒక దశలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ నగరంలోని డంపింగ్ యార్డ్‌ను అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు అతి సమీపంలోని సర్వే నంబరు 263, నారాయణపురం సర్వే నంబరు 58లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమ య్యారన్నారు. ఎంపిక చేసిన స్థలం నరసనాయనికుంటకు 100 మీటర్లు, నాగిరెడ్డిపల్లికి వెయ్యి, నారాయణపురానికి 300 మీటర్ల దూరంలో ఉందన్నారు. ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే నరసనాయనికుంట, నాగిరెడ్డిపల్లి, నారాయణపురం గ్రామాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తాము వ్యతిరేకించామన్నారు. ఈ మూడు గ్రామాల్లో 13 వేల మంది జనాభాతో పాటు కొడిమి గ్రామానికి చెందిన 5 వేల మంది ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. అయినప్పటికీ అక్కడే ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం రావడంతో మూడు గ్రామాల ప్రజలు ఐక్యంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టామన్నారు. డంపింగ్ యార్డును జనావాసాలకు సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, అలాంటిది తమ గ్రామాల మధ్య ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు. నగరంలోని చెత్తను తీసుకొచ్చి తమ గ్రామాల వద్ద వేసి ఊర్లను చెత్త దిబ్బలుగా మార్చాలని చూస్తారా అంటూ అధికారులపై మండిపడ్డారు. బుద్ధి ఉన్న వారెవరైనా డంపింగ్ యార్డును గ్రామాల మధ్య జనావాసాల సమీపంలో ఏర్పాటు చేయాలని చూస్తారా అని ప్రశ్నించారు. తమ గ్రామాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని తామందరం ఐక్యంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాదు.. కూడదు అక్కడే ఏర్పాటు చేస్తామని ముందుకు వస్తే ఆ తరువాత పరిణామాలు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను రైతులు కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు.డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మూడు గ్రామాల పెద్దలు, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటరాముడు, నాగరాజు, రంగంపేట గోపాల్‌రెడ్డి, వెంకటేష్, రవి, పెద్దన్న, నాయక్, రమణ, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, కేశవ్, ఆదినారాయణ, నాగేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, దామోదర్, సన్నప్పయ్య, రాయదుర్గం ఆంజనేయులు, రేనాటి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

• నెల్లూరు జీజీహెచ్ ఎదుట స్నేహితుల ఆందోళన



శ్రీకాంత్ మృతదేహం

నెల్లూరు సిటీ: ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలానికి చెందిన జానా శ్రీకాంత్ (23) నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి గ్రామంలో ఉన్న నస్ ఫార్మసీ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రమణయ్య హాస్పిటల్లో ఫార్మసిస్ట్‌గా పార్ట్‌టైం పనిచేస్తున్నాడు. బుధవారం శ్రీకాంత్ హాస్పిటల్లో విధుల్లో ఉండగా కింద పడిపోయాడు. దీంతో సిబ్బంది ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ స్నేహితులు జీజీహెచ్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. శ్రీకాంత్ ఆస్పత్రిలో విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని ఆరోపించారు. అయితే సిబ్బంది మాత్రం హార్ట్ ఎటాక్ అని చెప్పడంపై అనుమానం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష్యంతోనే తమ స్నేహితుడు మృతిచెందాడని ఆగ్రహించారు. ఈ క్రమంలో జీజీహెచ్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లావణ్యంగా చెప్పి.. శ్రీవాణి ఒడి చేర్చి

బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించి, పుస్తెల భారం వేయకుండా పుస్తకాలతో చెలిమి చేయించేందుకు ఆత్మకూరు సెక్టార్‌లో పనిచేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చొరవ తీసుకున్నారు. ఆడపిల్లకు వయస్సు రాగానే భారంగా భావిస్తూ పెళ్లి చేసేందుకు సిద్ధమవుతున్న తల్లిదండ్రుల్లో మార్పు తీసుకువచ్చి పిల్లలను బడి బాట పట్టించారు.

• బాల్య వివాహాలను అడ్డుకుని భరోసాగా నిలిచిన ఐసీడీఎస్ సిబ్బంది
• ఏడాదిలో 32 మందిని పాఠశాలల్లో చేర్పించిన వైనం



చదువు మానేసిన వెన్నెలను ప్రభుత్వ కళాశాలలో చేర్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది (ఫైల్)

ఆత్మకూరు: ఉన్నత చదువులు చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అనుకుంటున్న బాలికలకు కొందరు తల్లిదండ్రులు మూడు ముళ్ల బంధనాలు వేసి సంసార సాగరం లోకి నెట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పుస్తెలు వద్దు.. పుస్తకాలే ముద్దు' అంటూ ఊరూరా ప్రచారం చేస్తూ.. మరో వైపు సదస్సులతో ప్రజల్లో చైతన్యం రగిలిస్తున్నారు ఆత్మకూరు మండలంలో పనిచేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను తల్లిదండ్రులకు సవివరంగా తెలియజేస్తున్నారు. ఆడపిల్ల భారం కాదని నచ్చచెప్పి వారిని ఎంఈఓ, మహిళా పోలీసులు సౌజన్యంతో బడిబాట పట్టిస్తున్నారు.

అందరూ చదువుల తల్లి ముద్దు బిడ్డలే...

గత ఏడాది చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి ప్రతి గ్రామంలోని ప్రతి వీధినీ జల్లెడ పట్టి చదువు మానేసిన 32 మందిని గుర్తించి తిరిగి బడి బాట పట్టించారు. వీరిలో 25 మంది బాలికలు ఉన్నారు. కొందరిని బాల్య వివాహం చేసేందుకు సిద్ధమైనట్లుగా గుర్తించారు. బాల్య వివాహాల కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కల్పించి తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొందరిని పదో తరగతిలో చేర్పించగా మరి కొందరిని దూర విద్య ద్వారా ఇంటర్, డిగ్రీ చదువులు పూర్తి చేసేలా చొరవ తీసుకున్నారు. ఇందుకు అవసరమైన ఫీజులను సైతం సూపర్‌వైజర్లే చెల్లించారు. 32 మందిలో 31 మంది క్రమ తప్పకుండా పాఠశాలలకు వెళ్తూ పట్టుదలతో చదువుకుని వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ముగ్గురు బాలికలు పదో తరగతిలో, 13 మంది ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 15 మంది విద్యార్థులు 8వ తరగతి, 9వ తరగతిలో చదువుతున్నారు.

బాల్య వివాహాలు నేరం




చాలా మంది కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేవంటూ అమ్మాయిలకు బాల్యంలోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. మరి కొంత మంది అబ్బాయిలను పనిలోకి పంపుతున్నారు. కానీ వారు చదవుకుంటే వారి భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులు ఆలోచించడం లేదు. ఈ విషయంగా మేము 2024లో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఊరూరా తిరిగి 32 మంది బాలబాలికలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించాం. ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు చాలా సహకరించారు. ఇందులో 31 మంది చదువుకున్నారు. ముగ్గురు పదో తరగతిలో, 13 మంది ఇంటర్‌లో టాపర్లుగా నిలిచారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలకు సిద్ధమైతే 1098కు సమాచారం ఇవ్వండి. – లావణ్య, శ్రీవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆత్మకూరు మండలం

పట్టుదలతో చదువుకుని



మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా నా చిన్న వయస్సుల్లోనే నాకు పెళ్లి చేశారు. 9వ తరగతి వరకు చదువుకున్నా. చదుకోవాలనే చాలా ఆశగా ఉండేది. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ అధికారులు, కార్యకర్త నన్ను ప్రోత్సహించారు. పదో తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాను. నాకు గుడ్‌క్లినికల్ ప్రాక్టీస్ పథకం కింద రూ.10 వేలు లబ్ధి చేకూరింది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుకోవాలని ఉంది. – స్వర్ణలత, సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

అవకాశం ఇస్తాం



కారణమేదైనా మధ్యలో చదువు మానేసినా.. లేదా బాల్య వివాహాలు చేసుకుని చదువులకు దూరమైన ప్రతి ఒక్కరికీ మళ్లీ చదువుకునే అవకాశం కల్పిస్తాం. బడికి నేరుగా వెళ్లలేని వారికి దూర విద్య ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తాం. ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. – నరసింహారెడ్డి, ఎంఈఓ, ఆత్మకూరు

26 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

శెట్టూరు: మండలంలోని మాకోడికి గ్రామంలో దళితులపై దాడి చేసిన 26 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ మంగళవారం తెలిపారు. గత శనివారం రాత్రి పీర్ల పెద్ద సరిగెత్తు సందర్భంగా పానకాలు సమర్పించేందుకు పీర్ల మకానంలోకి వెళ్లిన దళితులు గంగాధర్‌తో పాటు మరికొందరిపై గ్రామానికి చెందిన కొందరు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు దాడికి పాల్పడిన 26 మందిపై అట్రాసిటీ యాక్ట్‌తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని పాములాయి క్రాస్ నుంచి తాడిపత్రి వైపు వెళ్లే 544వ జాతీయ రహదారిపై బోయకొట్టాల సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న బీకేఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని నిర్ధారించారు. చేతిపై ఏఏ, అల్లు అర్జున్ అనే ఇంగ్లిష్ అక్షరాల పచ్చ బొట్టు ఉంది. ఎడమ చేతి వేలిపై ఎస్ అనే ఇంగ్లిష్ అక్షరం పచ్చ బొట్టు ఉంది. గొంతు, నడుము వద్ద తీవ్ర గాయాలున్నాయి. శరీరంపై డ్రాయర్ తప్ప ఎలాంటి దుస్తులూ లేవు. వాహనం దూసుకెళ్లడంతో మృతదేహం, తల ఛిద్రమయ్యాయి. అయితే ఎక్కడైనా హతమార్చి తీసుకొచ్చి ఇక్కడ పడేశారా? లేదా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన అనంతరం వాహనాలు దూసుకెళ్లి మృతదేహం ఛిద్రమైందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, యువకుడి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96816 లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆడిట్ పేరుతో పైసా వసూల్

• మెప్మాలో అవినీతిపై కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఫిర్యాదు
• సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు

అనంతపురం అర్బన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతి తారస్థాయికి చేరిందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన చాంబర్ వద్ద మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి, పరిస్థితి వివరించారు. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు సంబంధించి అంతర్గత ఆడిట్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఇందుకు గాను ఒక గ్రూప్ రూ.300 చెల్లించాలని ప్రభుత్వమే ధర నిర్ణయించిందన్నారు. అయితే మెప్మాలో దిగువ స్థాయి అధికారులు మాత్రం ఒక్కొక్క గ్రూపు నుంచి రూ.500 నుంచి రూ.1,500 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాగే ఆగస్టు 15 నాటికి ప్రతి ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలు ఒక వస్తువు కొనేందుకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని, ప్రతి వస్తువుపై రూ.70 నుంచి రూ.100 వరకు ఎక్కువ ధరకు విక్రయించేలా మెప్మాలోని కొందరు ఉద్యోగులు కథ నడిపి దాదాపు రూ.8 లక్షలు వరకు సభ్యుల నుంచి వసూలు చేయించినట్లు తెలిసిందన్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆర్పీల ద్వారా సభ్యుల ఇళ్లకు వస్తువులు చేర్చి వాటిని కచ్చితంగా కొనాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. పామిడిలో ఒక పెట్టీకోట్ రూ.90 ఉంటే రూ.150తో సభ్యురాలి ఇంటికి చేర్చారని గుర్తు చేశారు. ఫినాయిల్, శానిటరీ నాప్‌కిన్స్‌లను తయారు చేస్తున్న సభ్యుల నుంచి కొనుగోలు చేయకుండా ముంబయిలోని ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని విక్రయిస్తున్నారని ఆరోపించారు. ర్యాపిడో స్కూటర్స్ అంటూ 40 మంది మహిళలకు స్కూటర్లను ప్రభుత్వం ఇచ్చిందని, 40 రోజులైనా అవి ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఈ స్కూటర్లు ఎవరికి ఇచ్చారో కూడా అంతు చిక్కడం లేదన్నారు. మెప్మా అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళ విభాగం జిల్లా కార్యదర్శులు భారతి, అనురాధ, నగర ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకురాళ్లు కమలమ్మ, మహేశ్వరి, రమిజా, పద్మావతి, పసన్నలక్ష్మి, జయమ్మ, కమలమ్మ, చంద్రకళ, తలారి ఉష, ఎం.ఉష, తదితరులు ఉన్నారు.

భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే..

• రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మురడిలో ప్రత్యేక పూజలు అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి (చిత్రంలో) మెట్టు విశ్వ, పార్టీ నాయకులు

డి.హీరేహాళ్ (రాయదుర్గం): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమప్రాధాన్యతగా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. డి హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లోని మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు.. అధికారం చేపట్టిన ఏడాదిలోనే కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. దగా పడిన రాష్ట్ర ప్రజలు జగన్ 2.0 కోసం ఎదురుచూస్తున్నారన్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని గుర్తుచేశారు. ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. కూటమి సర్కార్ అమల్లోకి తీసుకొచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగంపై భయపడాల్సిన పనిలేదన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరిగినా అందరూ కలసికట్టుగా పోరాటం సాగించాలన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ గంగప్ప, మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, మురళీమోహన్‌రెడ్డి, పాటిల్ వీరభద్రారెడ్డి, అంజిరెడ్డి, రవీంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధినేతతో భేటీ




సహచర జెడ్పీ చైర్‌పర్సన్లతో కలసి వైఎస్ జగన్‌ను కలిసిన గిరిజమ్మ, పార్టీ అధినేతతో సాకే శైలజనాథ్

శింగనమల/అనంతపురం సిటీ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం వేర్వేరుగా ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజమ్మ వెంట రాష్ట్రంలోని వివిధ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్లు ఉన్నారు. అలాగే శింగనమల నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలతో పాటు, నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్న విషయాన్ని అధినేతకు శైలజనాథ్ వివరించారు.

విద్యా విషయ కేలండర్ విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా సాధారణ పరీక్ష మండలి (డీసీఈబీ) ఆధ్వర్యంలో రూపొందించిన 'విద్యా విషయ కేలండర్ 2025–26'ను బుధవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 233 పాఠశాలల పనిదినాలు కాగా... ఇందులో కనీసం 220కు తగ్గకూడదని కేలండర్‌ను రూపొందించినట్లు డీఈఓ తెలిపారు. సంబంధిత పర్యవేక్షణ అధికారి ముందస్తు అనుమతితో ఐచ్ఛిక సెలవులు 5, స్వయం నిర్ధాయక సెలవులు మూడు వాడుకోవచ్చన్నారు. సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు దసరా సెలవులు, సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు క్రిస్మస్ సెలవులు, 2026 జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు, క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు జనవరి 10 నుంచి 15 వరకు సెలవులు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లా కడపలో జరిగే అండర్–16 సౌత్ జోన్ క్రికెట్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎంపికైనా వారిలో ఆర్.సాత్విక్ (కెప్టెన్, అనంతపురం), ఎస్.సంజయ్‌కుమార్ (వైస్ కెప్టెన్, నార్పల), జి.కౌశిక్ (వికెట్ కీపర్, అనంతపురం), కె.అశ్విన్, యు.తన్మయ్ కార్తీక్‌రెడ్డి, అభినవ్ సాత్విక్ రెడ్డి, కుషాల్ సాయి, దేవాన్ష్, టి.కిరణ్‌కుమార్, వై.లిఖిత్, పి.నిహార్, ఎస్.కార్తీక్ (అనంతపురం), జియాద్ (హిందూపురం), జె.సంతోష్ (కదిరి), బి.అఖిల్ కుమార్ (గోరంట్ల), ఆదినారాయణ రెడ్డి (ఆత్మకూరు), బి.అఖిల్ కుమార్ (గొట్లూరు) ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



నారాయణ (ఫైల్)

నార్పల: అప్పుల బాధ తాళలేక గత వారం ఆత్మహత్యాయత్నం చేసిన రైతు ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక బుధవారం మృతి చెందాడు. వివరాలు.. నార్పల మండలం గడ్డం నాగేపల్లి కి చెందిన రైతు నారాయణ(64) ఐదేళ్లుగా తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో అరటి సాగు చేస్తున్నాడు. పంటకు మద్దతు ధర లేక ఏటా తీవ్రంగా పంట నష్టపోయేవాడు. ఈ క్రమంలో పంట పెట్టుబడులకు చేసిన రూ.8 లక్షల అప్పులకు వడ్డీలు చెల్లించలేక మనోవేదనకు లోనైన ఆయన పక్షవాతం సోకి మంచాన పడ్డాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆయన మృతిచెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కేఎస్ఎన్' డిగ్రీ ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం ప్రిన్సిపాల్ కేసీ సత్యలత, పరీక్షల విభాగాధిపతి హెచ్.శివశంకర్ బుధవారం విడుదల చేశారు. 623 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 71.75 శాతంతో 447 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏ (ఆనర్స్)లో 85 మందికి గాను 61 మంది. బీకాం (ఆనర్స్)లో 221 మందికిగాను 160 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 228 మందికి గాను 214 మంది, బీబీఏలో 29 మందికిగాను 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను కళాశాల ఎగ్జామినేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 21 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. రీవాల్యూషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.300, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.600 చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల ఉప విభాగాధిపతి రమణ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, రామలింగారెడ్డి, నాగభూషణం, సింధు, రామకృష్ణ, రామాంజనేయులు, రేణుకాదేవి, ఆదినారాయణ, పర్వీన్, అనురాధ, రమాదేవి, లక్ష్మి, యూడీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమాలపై నామమాత్రపు విచారణ



కన్నేపల్లిలో ఏపీడీ రమేష్‌నాయక్‌తో కలసి విచారణలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: ఉపాధి అక్రమాలపై అధికారులు నామమాత్రపు విచారణతో సరిపెట్టారు. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అక్కమాలకు పాల్పడుతున్నట్లు గత సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం ఏపీడీ రమేష్‌నాయక్ బుధవారం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ సమయంలో స్థానిక టీడీపీ నేతలను వెంటబెట్టుకుని రావడం విమర్శలకు తావిచ్చింది. అధికారులు క్షేత్రస్థాయిలో పనులు జరిగిన ప్రదేశాలను తనిఖీ చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని ఇలా టీడీపీ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటిస్తే ఫలితం ఏముంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

'డ్రిప్' పంపిణీ వేగవంతం చేయండి

అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మసాగు పథకంలో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి ఆదేశించారు. డ్రిప్ పరికరాల పంపిణీపై బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీడీ ధనుంజయతో కలిసి ఎంఐ ఇంజనీర్లు, డ్రిప్ కంపెనీ డీసీఓలతో సమీక్షించారు. ఈ ఏడాది ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం రాయితీతో పరికరాల పంపిణీ కొనసాగించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులకు సంబంధించి ప్రాథమిక పరిశీలన పూర్తి చేయాలని సూచించారు.

తమ్ముడూ.. అమ్మను బాగా చూసుకో

• తెలంగాణలో గుత్తి మండలానికి చెందిన యువకుడి ఆత్మహత్య



రేవంత్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్: 'తమ్ముడూ.. అమ్మను బాగా చూసుకో' అంటూ ఓ యువకుడు వీడియో కాల్‌లో తన సోదరుడికి సూచించి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన సూర్యనారాయణ, శారదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నంద్యాల రేవంత్ కుమార్ (28) ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూ తమకున్న 8 ఎకరాల్లో తమ్ముడు కిరణ్ కుమార్‌తో కలసి పంటలు సాగుతో పాటు బొలెరో వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. పంటల సాగుతో పాటు బొలెరో వాహనం కొనుగోలుకు అప్పులు చేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక నష్టపోయాడు. అలాగే బొలెరో వాహనానికి సరైన బాడుగలు లేకపోవడంతో నెలవారీ కంతులు కట్టుకోలేక రూ.16లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ తరచూ మదనపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుత్తి నుంచి మిరపకాయల లోడు తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరిన రేవంత్‌కుమార్... తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు వద్దకు చేరుకోగానే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి తమ్ముడికి వీడియో కాల్ చేశాడు. 'ఇక నేను మీకు భారం కాను... అమ్మను బాగా చూసుకో' అని చెప్పి పురుగుల మందు తాగాడు. గమనించిన బొలెరో వాహన క్లీనర్ వెంటనే అప్రమత్తమై వనపర్తి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రేవంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

• కళ్యాణదుర్గంలో రూ.2.91 లక్షల విలువైన ఎరువుల సీజ్

బొమ్మనహాళ్/కణేకల్లు/కళ్యాణదుర్గం: ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామంలోని శారదా దేవి సీడ్స్ ఎరువుల దుకాణం, కణేకల్లుక్రాస్‌లోని కోరమండల్, కణేకల్లులోని పీఏసీఎస్ ఫర్టిలైజర్ షాపు, కళ్యాణదుర్గంలోని శ్రీ హనుమాన్ ఫర్టిలైజర్స్, మధు ఫర్టిలైజర్స్‌ను తనిఖీ బృందం అధికారి (ఏడీఏ) సాల్‌రెడ్డి, కర్నూలు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రభూపతి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, కణేకల్లు వ్యవసాయాధికారి (టెక్నికల్) ఆర్.బాలునాయక్, ఏఓ జగదీష్, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, కళ్యాణదుర్గం ఏఓలు బాలానాయక్, శ్రావణ్ కుమార్ తనిఖీ చేశారు. కళ్యాణదుర్గంలోని దుకాణాల్లో భౌతిక నిల్వలకు ఈ–పాస్ నిల్వలకు వ్యత్యాసాన్ని గుర్తించారు. మొత్తం 12,570 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.2,91,674 ఉంటుందని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను సకాలంలో తెప్పించాలని ఆదేశించారు. ఆధార్‌కార్డు తీసుకువచ్చిన రైతుకు ఈ–పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలని సూచించారు. ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కాగా, కళ్యాణదుర్గంలో తనిఖీ బృందం పర్యటిస్తున్నట్లుగా తెలుసుకున్న పలువురు తమ ఎరువుల దుకాణాలకు మూత వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



'పొలం పిలుస్తోంది'లో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శైలజా కుమారి

ఆత్మకూరు: పంటల సాగులో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తప్పక పాటించాలని ఏడీఏ శైలజా కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని బి, యాలేరు, సనప గ్రామీపాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏడీఏ మాట్లాడారు. వేరుశనగకు సోకే తెగుళ్లు... నివారణ పద్ధతుల గురించి వివరించారు. వేరుశనగ విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా వాడాలన్నారు. అదే విధంగా లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం వల్ల పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ రుమానా బేగం, ఏఈఓ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి హెచ్చరించారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జూన్‌లో జరిగిన మాతా శిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ పీహెచ్‌సీ వైద్యాధికారులపై డీఎంహెచ్ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైరిస్క్ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు గర్భం ధరించినప్పటి నుంచి క్రమం తప్పకుండా యాంటినేటల్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, అనస్తీషియా వైద్యుడు మధుసూదన్, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు ఇందిరా ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం

- విజిలెన్స్ డీడీ శ్రీనివాసులు

తాడిపత్రి టౌన్: అవినీతికి పాల్పడిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు విజిలెన్స్ డీడీ శ్రీనివాసులు తెలిపారు. గత సామాజిక తనిఖీల్లో రికవరీ చూపని యాడికి, పెద్దపప్పూరు మండలాలకు చెందిన దాదాపు 50 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లతో తాడిపత్రిలోని ఏపీడీ కార్యాలయంలో బుధవారం ఆయన నేరుగా విచారణ చేపట్టారు. ఆయా మండలాల్లో వెలుగులోకి వచ్చిన అక్రమాలకు సంబంధించి దాదాపు రూ.2 కోట్లు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు అక్రమాలకు పాల్పడుతున్నారని, అవినీతికి పాల్పడిన ఏ ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్‌నూ వదలబోమన్నారు. సొమ్ము రికవరీ కాకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశుశాఖ ఇన్‌చార్జి జేడీగా శ్రీలక్ష్మి



డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతమున్న ఎఫ్ఏసీ జేడీ డాక్టర్ టీపీ సుధాకర్ వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. ఆయన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉంటూ అదనంగా జేడీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈఓగా ఆయన పదవీకాలం ఈ నెల 25న ముగియనుంది. ఈ క్రమంలో పదోన్నతి కోసం సెలవు పెట్టినట్లు సమాచారం. దీంతో ఆయన స్థానంలో జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు.

ప్రైవేట్ వాహనాలపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: పట్టణంలో 26 ప్రైవేట్ వాహనాలు ఎలాంటి అనుమతులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. వారం రోజుల్లో వాహనాలపై చర్యలు తీసుకోకపోతే గుంతకల్లు ఆర్‌టీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఉరవకొండ శ్రీసాయి లైట్ మోటార్ వెహికల్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక గవిమఠం ఆవరణలో అనుమతి లేని ఎర్టిగా వాహనాలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ.. గతంలో ఆర్టీసీ డీఎంతో పాటు ఆర్‌టీఓకు ఫిర్యాదు చేశామని.. అయితే వారు తూతూమంత్రంగా వాహనదారులను మందలించి చేతులు దులుపుకున్నారన్నారు.

అలా వస్తాం.. ఇలా వెళ్తాం!



బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్న అనస్తీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమణ్యం



బయోమెట్రిక్ వేసిన వెంటనే బైకులో వెళ్లిపోతున్న డాక్టర్ సౌజన్య, డాక్టర్ సుమన్



ఫేషియల్ బయోమెట్రిక్ వేసుకుని వెళ్లిపోతున్న మరికొంత మంది వైద్యులు

ఫేషియల్ బయోమెట్రిక్ అంతా తూచ్

- విధులకు వైద్యుల మంగళం
- ముందస్తుగా హాజరవుతున్నట్లు బయోమెట్రిక్
- ఆ తర్వాత వెంటనే ఇళ్లకు వెళ్తుండడంపై సర్వత్రా విమర్శలు

అనంతపురం మెడికల్: బోధనాస్పత్రిలో వైద్యులు విధులకు రాం..రాం చెబుతున్నారు. ప్రతి నెలా రూ.లక్షల్లో జీతాలు డ్రా చేస్తున్న వీరు.. అలా వస్తూ ఇలా వెళ్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వైద్యుడు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధిగా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలి. కానీ బోధనాస్పత్రిలో అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. జిల్లా ప్రజలకు పెద్దదిక్కైన సర్వజనాస్పత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులకు ఆలస్యంగా హాజరవుతుండడం చూస్తే వీరికి వైద్య వృత్తి పట్ల ఏపాటి గౌరవం ఉందో ఇట్టే అర్థమవుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం పేరుకు మాత్రమే ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఇదిగో సాక్ష్యం..

సర్వజనాస్పత్రిలో అనస్తీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమణ్యం బుధవారం ఉదయం 8.40 గంటల సమయంలో వైద్య కళాశాలకు వచ్చారు. బయోమెట్రిక్ వేసుకుని కాసేపటికే అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య (పల్మనాలజీ విభాగం), పెథాలజిస్టు డాక్టర్ సుమన్‌లు బుధవారం ఉదయం 8.57కు వైద్య కళాశాలకు వచ్చి, కళాశాల ఆవరణంలో బయోమెట్రిక్ వేసుకుని అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద కూడా ఉదయం 8.58 సమయంలో వైద్య కళాశాలకు స్కూటీపై వచ్చి బయోమెట్రిక్ వేసుకుని వెళ్లిపోయారు. జూనియర్ వైద్యులకు ఆదర్శంగా నిలవాల్సిన సీనియర్ వైద్యులే ఇలా విధులకు డుమ్మా కొడుతుండడం చర్చనీయాంశమవుతోంది. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లలో చాలా మంది సమయపాలన పాటించడం లేదు.

పీజీలపైనే భారం:

బోధనాస్పత్రిలో మొత్తం 21 విభాగాల్లో పీజీలు ఉన్నారు. ఆయా విభాగాల్లో పీజీలపైనే భారం మోపి సీనియర్లు వెళ్లిపోతున్నారు. ఎమర్జెన్సీ వార్డుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసుల పట్ల సీనియర్ వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పీజీలతోనే ఫోన్‌లో కనుక్కుంటూ సలహాలిస్తూ.. రోగులను నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో పీజీ వైద్యులు రోగులతో ప్రయోగాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బతకడం కష్టం అన్న కేసుల పట్ల సీనియర్ వైద్యులు మరీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఉన్నతాధికారుల ప్రేక్షకపాత్ర..

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం వైద్యుల సమయపాలన, ఆస్పత్రి పర్యవేక్షణ తదితర వాటిపై ప్రేక్షకపాత్ర పోషిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు ఉంది. కానీ, కొందరు వైద్యుల పనితీరుతో కళాశాల ఖ్యాతి అప్రతిష్ట పాలయ్యే దుస్థితి నెలకొంది. వైద్యులు తప్పుల మీద తప్పులు చేస్తున్నా.. జిల్లా అధికార యంత్రాంగం తేలిగ్గా తీసుకోవడం రోగులకు శాపంగా మారుతోంది. ఇప్పటికైనా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల్లో చెరగని ముద్ర వేసుకున్న రమేష్



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, రమేష్ కుటుంబ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమాలలో అలుపెరగని పోరాట యోధుడిగా పని చేసిన జె.రమేష్ ఉపాధ్యాయుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు జె.రమేష్ 5వ వర్ధంతిని బుధవారం స్థానిక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రమేష్ సతీమణి డి.విజయలక్ష్మి (రిటైర్డ్ హెచ్ఎం), కుటుంబ సభ్యులు, సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె.రమేష్ ఉపాధ్యాయ సమస్యలపై చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంసన్ కుమార్, నగరపాలక ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు ఎస్.ఓబులేసు, ఎస్.రామాంజనేయులు, ఫణి భూషణ్, యుగంధర్, గంగాధర్, భాగ్యరాజు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు నరహరి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.మురళీకృష్ణ, రాజన్న, విరుపాక్షి గౌడు, రవికుమార్, గోవర్ధన్, పి.శ్రీనివాసులు, కె.సురేష్ నాయక్, రమేష్ పాల్గొన్నారు.

'ఆర్టీఈ' విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయండి

- డీఈఓను కోరిన విద్యార్థుల తల్లిదండ్రులు



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం అమలు కావడం లేదని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త జిలాన్‌బాషా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యా హక్కు చట్టం ద్వారా పేద పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్‌టీఈ విద్యార్థులకు బకాయిలు చెల్లించడం లేదన్నారు. 'తల్లికి వందనం' పథకం అందరికీ కాకుండా కొందరికే పరిమితం చేస్తున్నారన్నారు. అర్హులైన చాలామంది తల్లులకు డబ్బు జమ కాలేదన్నారు. ఒక కుటుంబంలో ఒక విద్యార్థి ఆర్‌టీఈ సీటుకు ఎంపికైతే.. అదే కుటుంబంలోని తక్కిన విద్యార్థులను కూడా ఆర్‌టీఈ కింద చూపించడం దారుణమన్నారు.

ఎన్‌సీసీతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు

- ఎన్‌సీసీ తెలుగు రాష్ట్రాల డీడీజీ నరసింహ సేలాని



విజేత ట్రోఫీని అందజేస్తున్న డీడీజీ నరసింహ సేలాని

కూడేరు: ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందితే ఉన్నత విద్యతో పాటు విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉంటాయని క్యాడెట్లకు ఎన్‌సీసీ తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నరసింహ సేలాని సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజులుగా సాగిన ఎన్‌సీసీ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీడీజీ హాజరయ్యారు. క్యాడెట్లను కలిసి శిక్షణ తీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. మ్యాప్ రీడింగ్ , ఫైరింగ్, అబ్‌స్టికల్‌పై ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను అభినందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో క్యాడెట్లు అలరించారు. శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన క్యాడెట్లకు ట్రోఫీలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్, క్యాంప్ డిప్యూటీ కమాండర్ శశికుమార్, గుంటూరు, కాకినాడ, కర్నూలు, వైజాగ్ , తిరుపతి, హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామబాద్‌కు చెందిన 650 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించండి



ఎం.చెర్లోపల్లిలో పొలం బడి నిర్వహిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, ప్రతి రైతూ సేంద్రియ ఎరువులపై దృష్టి సారిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఎం.చెర్లోపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ... రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమిలో పోషకాలు తగ్గిపోతాయని, దీంతో దిగుబడి, నాణ్యత కూడా తగ్గుతుందన్నారు. అందువల్ల పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వృక్ష సంబంధమైన కషాయాలు, వేప నూనె వాడాలని రైతులకు సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు తగినట్లు పంటలను సాగు చేయాలన్నారు. ఎండు తెగులును తట్టుకునే ఎల్ఆర్‌జీ-52 కంది రకాలను వాడాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా భూసారాన్ని బట్టి పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అన్నదాత సుఖీభవ సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు ఆశించిన పురుగు నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రాజు, పద్మావతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

రాయదుర్గంటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా వృత్తి విద్య అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉరవకొండ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు వీరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఏదీ?

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



పెడనలో విలేకరులతో మాట్లాడుతున్న గిరిజమ్మ

అనంతపురం సిటీ: కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడిని ఆమె ఖండించారు. ఇలాంటి ఘటనలు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని జెడ్పీ చైర్మన్లతో కలసి బుధవారం కృష్ణా జిల్లా పెడనకు చేరుకున్న ఆమె నేరుగా ఉప్పాల హారిక ఇంటికి చేరుకుని పరామర్శించారు. అనంతరం అక్కడే మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ సహచరి హారికకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అత్యంత దురదృష్టకర ఘటనగా అభివర్ణించారు. మహిళా ప్రజాప్రతినిధి అనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా భౌతిక దాడులకు తెగబడటం క్షమించరానిదన్నారు. బీసీ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులనే టార్గెట్ చేసి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. హారికపై దాడికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వ పెద్దలపై ఉందని స్పష్టం చేశారు.

ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు



జి.కొత్తపల్లిలో విలేజ్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, వైద్య సేవలు అందించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివ కృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలోని విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. విలేజ్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలించి 108లో రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన రోజు నుంచి ప్రభుత్వాసుపత్రిలోనే వైద్య సేవలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు, పోషకాహారంపై అవగాహన కల్పించి, జిల్లాలో మాతా శిశు మరణాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ నరసింహ, ఎంఎల్‌హెచ్‌పీ నూరి పాల్గొన్నారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

రాప్తాడురూరల్: సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో కూలి పని కోసం వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని అరవిందనగర్‌లో నివాసం ఉంటున్న ముత్యాలప్ప అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి సమీపంలో నారాయణరెడ్డి సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో కూలి పనులకు వెళ్తుండేవాడు. నాలుగు రోజుల కిందట పనికి వెళ్లిన ముత్యాలప్ప మధ్యాహ్నం తోటి కూలీలతో కలిసి నగరానికి బయలుదేరాడు. చంద్రబాబు కొట్టాల సమీపంలోకి రాగానే తనకు కాస్త పని ఉందంటూ ఒక్కడే ఆగిపోయాడు. రాత్రయినా ఇంటికి చేరుకోలేదు. కంగారు పడిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన వారిని కలిసి ఆరా తీశారు. ఆచూకీ లభించలేదు. దీంతో రూరల్ పీఎస్‌లో ముత్యాలప్ప భార్య అలివేలమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాత పెన్షన్ విధానం కోసం రేపు ఆందోళన

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో డీఎస్సీ- 2003 ఫోరం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేయనున్నట్లు ఫోరం నాయకులు మధుప్రసాద్, మారుతీప్రసాద్, వరదరాజులు, నాగభూషణ, ప్రసాద్, ఎర్రిస్వామి, నాగేంద్రబాబు, సాయి, చంద్ర, మునెయ్య తెలిపారు. సీపీఎస్ అమలు తేదీ కంటే ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా రిక్రూట్ అయ్యి ప్రభుత్వ పరిపాలనా కారణాలతో నియామకాలు ఆలస్యమైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం కేంద్ర ప్రభుత్వం 57 మెమో జారీ చేసిందన్నారు. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 16 రాష్ట్రాల్లోని ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మాత్రం కేవలం ఐఏఎస్‌లకు వర్తింపజేశారన్నారు. తక్కిన ఉద్యోగులకూ న్యాయం చేయాలనే డిమాండ్‌తో నిరసన కార్యక్రమం తలపెట్టామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దాయాదుల ఘర్షణ

అనంతపురం: నారాయణపురంలో దాయాదుల మధ్య బుధవారం రాత్రి ఘర్షణ జరిగింది. దీనిపై నారాయణపురానికి చెందిన ఎస్. రామచంద్రా రెడ్డి భార్య ఎస్. అనసూయమ్మ నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నారాయణపురం 171-3 , 171-4 సర్వే నంబర్లలో 4.10 ఎకరాల భూమికి సంబంధించి తమకు, తమ దాయాదులైన ఉమ్మడి పవన్‌కుమార్‌రెడ్డి మధ్య తగాదా ఉందన్నారు. బుధవారం రాత్రి ఉమ్మడి మనోజ్ కుమార్ రెడ్డి, సాయి చరణ్ రెడ్డి, ఉమ్మడి రవి, ఉమ్మడి శంకర్ రెడ్డి, ఉమ్మడి రామ్మోహన్ రెడ్డి, ఉమ్మడి శంకరమ్మ అందరూ కలిసికట్టుగా తమ ఇంటి వద్దకు వచ్చి.. తమ కోడలు జాహ్నవి, శేషానందరెడ్డిని దుర్భాషలాడారన్నారు. ప్రహరీ ఎక్కి కిందకి దూకి అవమానపరిచే రీతిలో ప్రవర్తించారన్నారు. తమను చంపుతామని బెదిరించారన్నారు. దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

రాజీ మార్గమే రాజమార్గం

కళ్యాణదుర్గం: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజ మార్గమని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కట్టే భాను అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మధ్యవర్తులు ఉంటూ కేసుల రాజీ కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు నుంచి టీ సర్కిల్ వరకు న్యాయవాదులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

రేపు 'శకుని' నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: అనంతపురం జిల్లా తరఫున నంది నాటకోత్సవాలలో పాల్గొనబోతున్న 'శకుని' పౌరాణిక నాటకం ప్రదర్శన స్థానిక లలితకళాపరిషత్తులో ఉంటుందని ఎల్కేపీ కార్యదర్శి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సాంకేతిక నైపుణ్యంతో, సీనియర్ నటీనటుల ప్రతిభతో శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి సాగే నాటక ప్రదర్శనను అందరూ తిలకించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమాలు

అనంతపురం కల్చరల్: నగర శివారులోని శృంగేరీ శారదా శంకర మఠంలో బుధవారం గణపతి, సరస్వతీ దేవి హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు శక్తి స్వరూపిణి శారదా పరమేశ్వరికి సామూహిక కుంకుమార్చనలు, మహాశివుడికి అభిషేక అలంకార సేవలు చేశారు. అనంతరం వేదపండితులు సోమశేఖరశర్మ, విద్యాధరశాస్త్రి, అమరనాథశాస్త్రి తదితరులు గణపతి, నవగ్రహ సమేత సరస్వతీ దేవి హోమాలను జరిపించారు. వందలాది మంది విద్యార్థులు లోక కల్యాణం కోసం స్వచ్ఛందంగా హోమాలను చేయించడం శుభపరిణామమని నిర్వాహకులు అన్నారు. మఠం మేనేజర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

రేపు రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు ఉమానగర్‌లో రేణుకా యల్లమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఈ నెల 18, 19 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి, మాజీ మేయర్ రాగే పరుశురామ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం గంగ పూజ, ఏకాదశ ద్రవ్యాభిషేకం, పుష్పయాగం, సామూహిక లలిత సహస్ర పారాయణం, సాయంత్రం అమ్మవారి మెరవణి, శనివారం నవజ్యోతుల ఊరేగింపు, అన్నదానం ఉంటాయని ఆయన తెలిపారు.

దళితులకు రక్షణ కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: గ్రామాల్లో దళితులకు రక్షణ కల్పించాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా పలు గ్రామాల్లో పెత్తందారులు దళితులపై కుల వివక్ష చూపడంతో పాటు దాడులు చేశారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిరంజీవి, నగేష్, వరప్రసాద్, రామాంజినేయులు, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

అనంతపురం: నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో బేకరీలో పనిచేస్తున్న ప్రకాష్ అదృశ్యమయ్యాడు. కూడేరు మండలం శివరాంపేట గ్రామానికి చెందిన ప్రకాష్ పదో తరగతి ఉరవకొండలో చదువుకున్నాడు. ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు అతన్ని వేణుగోపాల్ నగర్‌లోని ఒక బేకరీలో పని కోసం వదిలి వెళ్లారు. ఈ క్రమంలో బాలుడు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. నాన్న తిట్టాడన్న కోపంతో బుధవారం ఉదయం నుంచి అదృశ్యమయ్యాడు. తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.